క్లుప్తంగా

సూక్ష్మ రుణాల చెక్కులు పంపిణీ



తెనాలిఅర్బన్: లెప్రో సొసైటీ వారి ఆధ్వర్యంలో తెనాలి డబుల్ హార్స్ సంస్థ సౌజన్యంతో 20 మంది కుష్టు, బోదవ్యాధి గ్రస్తులకు బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని ఫైలేరియా యూనిట్ కార్యాలయం వద్ద సూక్ష్మ రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ తెనాలి డబుల్ హార్స్ సంస్థ సహకారంతో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తుల పిల్లల ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సాయం కూడా చేస్తున్నట్లు చెప్పారు. ప్రతినెల మూడో బుధవారం బోద వ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణ శిబిరం నిర్వహించి వారికి అవసరమైన మందులు, పాదరక్షలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్లు తిరువీధుల శివరామప్రసాద్, దీపాల శ్రీనివాసరావు, వై ఎల్లయ్య, షేక్ బాషిద్ తదితరులు పాల్గొన్నారు.

పెదరావూరు స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు సరెండర్

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి మండలం పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బోధించడం లేదంటూ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఇటీవల జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి స్వయంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ అధికారులను నియమించి నివేదిక తెప్పించుకున్న డీఈవో శైలజ సదరు ఉపాధ్యాయుడిని సరెండర్ చేసి, పాఠశాలలో వేరొక ఉపాధ్యాయుడిని తెలుగు బోధించుటకు నియమించినట్లు తెలియజేశారు.

రామలింగేశ్వర స్వామికి తొలి ఏకాదశి అభిషేకం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామికి అభిషేకార్చనలు, అమ్మవారికి శాకాంబరీ అలంకారం విశేష పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పౌరుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



లక్ష్మీపురం: మోదీ ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో సామాన్య పౌరుల సంక్షేమంపై దృష్టి సారించాలని, చిన్న వ్యాపారాలను పెంచేందుకు మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు తయారీ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని అర్థశాస్త్ర శాఖాపన్యాసకులు సి.హెచ్.సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై బుధవారం చర్చాగోష్టి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తన దృష్టిని కొంత వరకు క్షేత్రస్థాయి ఆర్థిక సంక్షేమం వైపు మళ్లించటం చాలా అవసరమన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడారు.

మద్యం బాబులకు కౌన్సెలింగ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం కాజలో విస్తృతంగా పర్యటించి మద్యం బాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రూరల్ ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిరోజు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని, ముఖ్యంగా ప్రజలు సంచరించని ప్రదేశాలు, పంటపొలాల్లో మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, ఇతర మత్తు పదార్థాలు తాగే వారి గురించి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

భక్తి ప్రపత్తులతో తొలి ఏకాదశి పర్వదినం

- ఆలయాలకు భక్తుల తాకిడి
- విశేష పూజలు నిర్వహించిన వైదికులు
- భక్తులకు పేలపిండి ప్రసాదం వితరణ

తెనాలి: తొలి ఏకాదశిని పట్టణ ప్రజలు భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశి అన్ని పండుగలకు ఆదిగా నిలుస్తుంది. తెలుగు సంవత్సరంలో అన్ని పండుగలను వెంట పెట్టుకొస్తుందీ పర్వదినం. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వైకుంఠపురం దేవస్థానంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లను బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుండే భక్తులు రావటంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయం కళకళలాడింది. కొందరు భక్తులు పొంగలి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పండుగ సందర్భంగా ఆలయంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

● స్థానిక అమరావతి కాలనీలోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి శ్రీ గోదా పద్మావతి అమ్మవారిని, శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు.



వైకుంఠపురం ఆలయంలో భక్తుల పూజలు

ఆలయ కార్యనిర్వాహక కమిటీ తరపున తుమ్మల సత్యనారాయణ, కిక్కూరి చిన కృష్ణారెడ్డి, దేవాభక్తుని ఉమా మహేశ్వరరావు, పుష్ప కుమారి తదితరులు పర్యవేక్షించారు

● నాజరుపేటలోని శ్రీపాండురంగ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పాండురంగ స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. నాజరుపేటలోని అనుగోలువారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీపాండురంగ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తురగా నాగరాజు శర్మ నేతృత్వంలో పాండురంగస్వామికి విశేష అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామార్చనలు చేశారు. స్థానిక భక్తులు ఉదయం నుంచి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తొలి ఏకాదశి ప్రాధాన్యత కలిగినది కావటంతో గుడికి వెళ్లలేని వారు తెల్లవారుతూనే నిద్రలేచి, తలారా స్నానం చేసి, ఇళ్లలోనే పూజలు చేసుకున్నారు. ఉపవాస దీక్షలను చేశారు.



వైకుంఠపురం ఆలయంలో క్యూలో భక్తులు

ఇది ఆషాఢ శుద్ధ ఏకాదశి...

ప్రతి నెల కృష్ణపక్షంలో ఒకటి, శుక్లపక్షంలో ఒకటి చొప్పున నెలకు రెండు ఏకాదశులు వస్తుంటాయి. ప్రతి ఏకాదశికి ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఏకాదశి అంటే పదకొండు అని అర్థం. మనకు ఉన్న అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు...వీటిని పనిచేయించే అంతరేంద్రియం అయిన మనసును కలిపితే మొత్తం పదకొండు. ఈ పదకొండూ ఏకోన్ముకంగా పనిచేసే సమయమే ఏకాదశి. ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశిని ఆషాఢ శుద్ధ ఏకాదశిగా జరుపుకుంటారు. దీనినే శయన ఏకాదశి, హరి వాసరం అని కూడా అంటారు. ఈరోజు నుంచీ మహావిష్ణువు క్షీరాబ్ధి యందు శేషపాన్పుపై శయనిస్తాడు. అందుచేతనే శయన ఏకాదశి అన్నారు.

ఇది రైతుల పండగ..

తొలి ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు చాతుర్మాస వ్రతం అవలంబిస్తారు. శాఖాహారులై ఉపవాస వ్రతం ఆచరించాల్సి ఉంటుంది. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఏరువాకలానే తొలి ఏకాదశిని వేడుకగా చేసుకుంటారు. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదనీ, పైరుకు ఏ రకమైన తెగుళ్లు సోకకూడదనీ, ఇతరత్రా ఏ సమస్యలూ రాకూడదని దేవుడిని మొక్కుతారు. తొలి ఏకాదశి పర్వదినాన మొక్కజొన్న పేలాలను మెత్తటి పొడిగా దంచి, అందులో నూరిన బెల్లం కలిపి దేవుడికి నైవేద్యంగా సమర్పించి, ప్రసాదంగా తీసుకుంటారు. ఈ పేలపిండిని తప్పక తినాలనేది భక్తుల విశ్వాసం.

అత్యాచార కారకులను కఠినంగా శిక్షించాలి

- పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే పోరాటానికి కార్యాచరణ
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి: చేబ్రోలు గ్రామానికి చెందిన దళిత మైనర్ బాలిక పేరుపోగు శైలజపై అత్యాచారం దుర్మార్గమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ రేడియో అండ్ రీడింగ్ రూమ్ ఆవరణలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసి రోజులు గడుస్తున్నా నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కేసు పట్ల పోలీసులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నేత ఉన్నం రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే శైలజ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, ఎకరం సాగు భూమిని అందజేయాలన్నారు. వీరితో మోదుకూరి దావీదు, ఉన్నం చిన్నజాను, ఉన్నం అంతోను, ఉన్నం సన్నీ, ఉన్నం ఇమ్మానుయేలు, ఉన్నం గోపి, గొరికపూడి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కారంచేడు మృత వీరులకు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఉన్నం ధర్మారావు మాదిగ

కారంచేడు అమరవీరులకు నివాళి

తెనాలి: పలు దళిత సంఘాల నేతృత్వంలో బుధవారం 1985 కారంచేడు అమరవీరులకు ఘన నివాళులర్పించారు. బీజేఆర్ కమిటీ, ఎమ్మార్పీఎస్, జైభీమ్ ఫెడరేషన్ నాయకులు స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కారంచేడు మృత వీరులను స్మరించుకున్నారు. వారికి జోహార్లు అర్పించారు. ప్రభుత్వం నాటి బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. చేబ్రోలులో దళిత విద్యార్థిని అత్యాచారానికి కారకులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్, జైభీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కట్టెవరపు దేవయ్య, సీనియర్ న్యాయవాది ఇందుపల్లి రాజారావు, యడ్లపల్లి అనిల్‌కుమార్, కిన్నెర నాగరాజు, ఆలపాటి కరుణమాదిగ, కట్టెవరపు కోటేశ్వరరావు మాదిగ, బీజేఆర్ కమిటీ కార్యదర్శి నలుకుర్తి సద్గుణరావు, ఈపూరు ప్రేమకుమార్, పినపాటి సునీల్, సిద్దెల కమల తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పారిశుద్ధ్య పనుల కోసం వీక్లీ యాక్షన్ ప్లాన్ అవసరం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: గుంటూరు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు వీక్లీ స్పెషల్ యాక్షన్ ప్లాన్ ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి అధికారులు, సిబ్బంది సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల అమలులో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మెరుగైన పారిశుద్ధ్య సేవలతో పాటు తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగాలని కోరుకుంటారన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని చెప్పారు. అవుట్ ఫాల్ డ్రైన్స్‌లో పూడికతీత పనులు జరుగుతున్నప్పటికీ అంతర్గత వీధుల్లోని డ్రైన్లలో ఇది జరగడంలేదన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా అంతర్గత డ్రైన్ల శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా పనులు చేపట్టాలని సూచించారు. కీర్తి చేకూరి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం వీక్లీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ నిర్వహిస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు జీఎంసీ నుంచి వచ్చే వాహనాలకు చెత్త ఇవ్వాలని, రోడ్ల మీద, కాల్వల్లో వేస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నామని, సమస్యల తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో ఎస్ఈ శ్యాం ప్రసాద్, ఎంహెచ్ఓ మధుసూదన్, డీసీపీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

దళిత రాజకీయ చైతన్యమే కారంచేడు సంఘటన

నెహ్రూనగర్: 1985లో కారంచేడు దళితులపై అగ్రకుల భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక న్యాయశక్తిగా మారి నూతన చట్టాలను సాధించి రాజ్యాంగ హక్కులు పొందగలిగామని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. కారంచేడు దళిత అమరవీరుల సంస్మరణ సభ నగరంలోని అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, ప్రజా పోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు, దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కొరబండి బాబురావు, డెమోక్రటిక్ పార్టీ అధినేత టెన్నిస్ రాయ్, చార్వాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్, యానాది హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు బాపట్ల ఏసుబాబు, ఆర్ పి ఐ అత్వలే పార్టీ రాష్ట్ర నాయకులు విప్పర్ల ముత్తయ్య, భీమ్ భారత్ జిల్లా నాయకులు యానం ఆనంద్, ఆంధ్రప్రదేశ్ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు. మాల మహానాడు రాష్ట్ర నాయకులు బత్తుల అనిల్ బాబు, బీఎస్పీ... జిల్లా నాయకులు చిరతగుంట్ల వాసు, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం దితరులు పాల్గొన్నారు.



కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

కారంచేడు ఘటన సమాజానికి మాయని మచ్చ అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో కారంచేడు మృతవీరులకు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మక్కెన ప్రభాకర్, సుబ్బయ్య, అబ్రహం, చంద్రశేఖర్, బాబురావు, ఎస్‌కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు విన్నవించారు. స్థానిక మాయాబజార్‌లోని తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు షేక్ నసీర్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును నిలుపుదల చేసి జీఓ నంబర్ 17ను ప్రవేశపెట్టి కార్మికులకు అన్యాయం చేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్ స్పందిస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.



తూర్పు ఎమ్మెల్యే షేక్ నసీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీసీ నాయకులు

రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలి

సీపీఎం నేత బాబూరావు డిమాండ్

లక్ష్మీపురం: కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి వై.నేతాజీ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ తక్షణం అవసరమైన పరిపాలన భవనాలను నిర్మాణం చేయాలన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు ఇస్తూనే కాలపరిమితిని పెంచాలని కోరారు. అసైన్డ్ రైతులకు ప్యాకేజిని పెంచాలని, రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని పేదల జీవన ప్రమాణాలను పెంచే విధంగా వారికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు ఇస్తున్న పెన్షన్లు నెలకు 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కోసం కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు, పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌ను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అన్ని ఇసుక రీచ్‌లను తెరిచి వాటికి దారులు ఏర్పాటు చేయాలని, పేదలకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని, కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని సమావేశం తీర్మానించినట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఈమని అప్పారావు, కె.నళినికాంత్, ఎమ్.భావన్నారాయణ, ఎం.రవి సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జె.వి.రాఘవులు, నాయకులు ఎల్.అరుణ, డి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత బాబూరావు

కేఎల్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో చదివిన 1995– 1999 బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం పూర్వ విద్యార్థులలో స్నేహభావాన్ని పెంపొందించి గత జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి స్ఫూర్తిని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో , రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, పూర్వ విద్యార్థులు సంబంధాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్. కావ్య, ఉద్యోగ కల్పనల డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, సీఎస్ఈ రెగ్యుల్ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వక్తృత్వ, క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కే.ఎస్ లక్ష్మణరావు, పక్కన యూటీఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఆగస్టు 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక బ్రాడిపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్లు గడిచిన సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైజ్ఞానిక స్పృహను పెంచే విధంగా వివిధ రకాల కార్యక్రమాలను జేవీవీ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జాన్ బాబు, నాయకులు డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్, గోరంట్ల వెంకటరావు, ఎస్ఎం సుభాని, ఉదయ భాస్కర్, శంకర్ సింగ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట సిద్దేశ్వర పీఠపాలిత ఓంకార క్షేత్ర ప్రాంగణంలో బుధవారం గాయత్రి సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో సద్గురు శ్రీనారాయణ తీర్థ జయంతి మహోత్సవాలు జరిగాయి. అనంతరం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్.నారాయణమూర్తి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. స్థానిక కళాకారులు 20 మంది తమ గాత్రధారులతో నారాయణ తీర్థుల విరచిత తరంగాలను శ్రావ్యంగా ఆలపించారు. సమ్మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎం.వై.శేషరాణి పర్యవేక్షించారు.

28న ఉచిత కంటి వైద్య శిబిరం

తెనాలి: శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న చుండూరు మండల గ్రామం మోదుకూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గ్రామంలోని శ్రీ షిరిడీ సాయి, సత్యసాయి బాబా మందిరంలో ఉదయం 8 గంటల్నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి లోపల అద్దం (ఐఓఎల్) అమర్చే శస్త్రచికిత్స చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు ఎల్.రఘునాధరెడ్డి 9441176123, ఎం.శ్రీనివాసరావు 9441077404 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఏకలవ్య మహరాజ్ జయంతి



తెనాలి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ ఏకలవ్య మహరాజ్ జయంతిని నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఐక్యవేదిక కార్యాలయంలో ఏకలవ్య మహరాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎరుకుల ప్రజాసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, కట్టా బుల్లయ్య, దేవరకొండ గజేంద్ర, కట్టా రామాంజనేయులు, ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు జూపల్లి వంశీ, రూరల్ అధ్యక్షుడు కుర్రా జస్వంత్, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, పాధ్యక్షుడు నల్లగండ్ల రవిచంద్ర, మర్లపాటి నాగుల్, కనపర్తి శశి, పెరికల అరుణ్, రమేష్, కె.జేసుబాబు, వై.శ్యామ్ పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక హౌసింగ్‌బోర్డుకాలనీ షిరిడి సాయినాథ మందిరంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా సాయిబాబా వారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన, అలంకార పూజలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి నామం (24 గంటలు) ఏకాహం జరిగింది. బాబాను భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు.